క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


అన్నా రాంబాబును సన్మానిస్తున్న గౌస్ మొహిద్దీన్

మార్కాపురం: వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. పార్టీ పదవి వచ్చిన సందర్భంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకట రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీకి, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

బేస్తవారిపేట: మండలంలోని చింతలపాలెంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మండప దేవత పూజలు, దీక్షా హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం చేశారు.

వైభవంగా పట్టాభిరామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు


విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు, హోమాలు, సర్వ దేవతా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మరో రెండు రోజులపాటు ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

సీపీఐ రాష్ట్ర మహాసభకు తరలిరండి


మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు పుల్లయ్య

బేస్తవారిపేట: సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో నిర్వహించనున్నట్లు గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం కన్వీనర్ డాకాల పుల్లయ్య తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో ఏపీ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజానాట్య మండలి అధ్యక్షుడు రామకృష్ణ, సహాయ కార్యదర్శి జోసఫ్, రైతు సంఘం నాయకుడు అంకయ్య, ఏఐటీయూసీ నాయకుడు యోగయ్య పాల్గొన్నారు.

35 క్వార్టర్ల అక్రమ మద్యం సీజ్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న మద్యం విక్రేత

పొదిలి రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. శుక్రవారం కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల జంక్షన్ వద్ద ఓ దుకాణంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయగా 180 ఎంఎల్ పరిమాణంలో గల సిల్వర్ ట్రిప్స్, ఆఫీసర్ చాయిస్ బాటిళ్లు 35 లభ్యమయ్యాయని సీఐ చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితురాలు తోట సుబరత్తమ్మను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇదిగిదిగో ఇదీ.. కూటమి చెత్తశుద్ధి!

గిద్దలూరులో నిరుపయోగంగా చెత్త సేకరణ, శుద్ధి, కంపోస్ట్ కేంద్రాలు

- పాములపల్లె రోడ్డులో చిట్టడివిని తలపిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్
- ఖాళీగా దర్శనమిస్తున్న ముండ్లపాడు రోడ్డులోని కంపోస్ట్ యార్డు
- గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో నిర్మించిన కేంద్రాలకు తాళమేసిన కూటమి సర్కారు
- చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసే సంస్థకు బిల్లులు ఆపి సాగనంపిన వైనం
- గ్రంథాలయం వెనుక చెత్తను వేరు చేస్తుండటంపై స్థానికుల ఆగ్రహం

గిద్దలూరు రూరల్:

ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో రోజూ పోగయ్యే చెత్తను సక్రమంగా సేకరించడంతోపాటు తడి, పొడి చెత్తగా విభజించి ఎరువుగా మార్చి స్థానిక సంస్థలకు ఆదాయం సమకూర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన ఓ మంచి ప్రయత్నాన్ని కూటమి ప్రభుత్వం కూకటి వేళ్లతో సహా పెకలించే ప్రయత్నం చేస్తోంది. వీధుల్లో చెత్త సేకరించే ఆటోలను నిర్వహణ భారం పేరుతో ఇప్పటికే మూలన పడేసిన సర్కారు.. అంతకంటే ముందే చెత్త శుద్ధి కేంద్రాలు, కంపోస్ట్ యార్డులకు తాళమేసింది. వివరాల్లోకి వెళ్తే.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె రోడ్డులో సుమారు రూ.కోటి నిధులతో నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్), ముండ్లపాడు రోడ్డులో 2 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.కోటి మేర నిధులతో నిర్మించిన కంపోస్టు యార్డు, విండ్రో ప్రాసెసింగ్ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎంఆర్ఎఫ్) సెంటర్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపయోగంగా మార్చింది.

చేయాల్సిందొకటి.. చేస్తున్నదేంటి?

గిద్దలూరు పట్టణంలో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను పాములపల్లె రోడ్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించి తడి, పొడి, పనికిరాని భాగాలుగా వేరుచేయాలి. అందుకుగాను జీటీఎస్‌లో 91 అడుగుల వెడల్పు, 86 అడుగుల పొడవున సిమెంట్ ప్లాట్‌ఫాంతో కూడిన షెడ్, సిబ్బంది ఉండేందుకు రెండు గదులు నిర్మించారు. షెడ్డు నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం జీటీఎస్ షెడ్ చుట్టూ చిల్లచెట్లు భారీగా పెరగడంతో చిట్టడివిని తలపిస్తోంది.

తడి, పొడి చెత్తను శుద్ధి చేసేందుకు ముండ్లపాడు రోడ్డులోని చెత్త శుద్ధి కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. ఇక్కడ తడి చెత్తను ఎరువుగా తయారు చేయాలి. అయితే గిద్దలూరులో సేకరించిన చెత్తను స్థానిక గ్రంథాయలం వెనుక ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుస్తున్నారు. రోడ్డు మీదనే ప్రజలకు ఇబ్బంది కలిగించేలా చెత్తను వేరు చేసి ట్రాక్టర్ల సాయంతో ముండ్లపాడు రోడ్డులోని కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. తడి, పొడి, ప్లాస్టిక్ ఇలా మూడు రకాల వ్యర్థాలను కంపోస్ట్ యార్డుకు తరలిస్తుండటంతో అది కాస్తా డంపింగ్ యార్డుగా మారుతోంది. ప్లాస్టిక్, ఇతర పనికి రాని వస్తువులను కేఎస్ పల్లె రోడ్డులోని దుప్పిల తిప్పకు తరలించాల్సి ఉండగా అదేమీ పట్టించుకోకుండా కంపోస్ట్ యార్డులో పడేస్తున్నారు.



పాములపల్లె రోడ్డులో చెత్తను వేరుచేసే కేంద్రానికి తాళం


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రోడ్డు మీదే చెత్తను వేరు చేసుకుంటున్న సిబ్బంది



కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్న సిబ్బంది(ఫైల్)


ముండ్లపాడు రోడ్డులోని కేంద్రంలో చెత్తను కుళ్లబెడుతున్న సిబ్బంది (ఫైల్)

కంపోస్ట్ తయారీ సంస్థకు 'పొగ'

ముండ్లపాడు రోడ్డులోని చెత్త శుద్ధి కేంద్రంలో కంపోస్టు తయారీ లీజును గత ప్రభుత్వంలో హర్ష ఎకో ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. అప్పటి నుంచి వారి ఆధ్వర్యంలో తడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారు చేస్తూ వచ్చారు. అందుకు సంబంధించి సదరు సంస్థకు ఇవ్వాల్సిన బిల్లులను కూటమి ప్రభుత్వం నిలిపేయడంతో ఈ ఏడాది మార్చి నుంచి కంపోస్ట్ తయారీ ఆగిపోయింది. ఆయా కేంద్రాలను ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకొస్తారో లేదో వేచి చూడాల్సిందే.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు


మార్కాపురంలో ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు


బేస్తవారిపేట : సామూహిక వరలక్ష్మీ వ్రత పూజల్లో భక్తులు

బేస్తవారిపేట: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు ఆలయాల్లో సామూహిక పూజలు నిర్వహించారు. బేస్తవారిపేట జంక్షన్ సమీపంలోని త్రిలోక పుణ్యక్షేత్రం సాయిబాబా ద్వారకామాయిలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు. 108 మంది మహిళలు కలశపూజ, కుంకుమార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పాతాళనాగేశ్వర స్వామి ఆలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈఓ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయం, నల్లబండ బజారులోని కనక దుర్గమ్మ ఆలయంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండస్వామి సమేత జగదాంబ అమ్మవారు, అల్లూరి పోలేరమ్మ ఆలయంతోపాటు పలు దేవస్థానాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. శివాలయంలో జగదాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు తమ నివాసాల్లో వరలక్ష్మి వ్రతం ఆచరించి వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.


గిద్దలూరు పాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో..

వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల నియామకం

మార్కాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

బీసీ విభాగం మండల ఉపాధ్యక్షులుగా బత్తుల అల్లూరయ్య, జాజా వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీలుగా మారంరెడ్డి నాగిరెడ్డి, చిలక శేషయ్య, కట్టిపల్లి వెంకట రమణయ్య, క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులుగా బూదాల యేబు, బూదాల మరియబాబు, జనరల్ సెక్రటరీలుగా కొండేటి నాగయ్య, మాకం బాబు, బూదాల మోహన్‌రావు, సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులుగా గాయం రాజశేఖర్, కొలగట్ల రంగారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా జాజా వెంకటేశ్వర్లు, ఉడుముల మల్లికార్జునరెడ్డి, కంది రామచంద్రారెడ్డి, దివ్యాంగుల విభాగం ఉపాధ్యక్షులు మందటి శివారెడ్డి, పరిశినేని ఆంజనేయులు, జనరల్ సెక్రటరీలుగా మల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పోల కొండలరావు, బొందల సురేష్, మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా సూరెడ్డి శ్రీలక్ష్మి, లింగారెడ్డి శ్రీలత, జనరల్ సెక్రటరీలుగా తమ్మిశెట్టి భార్గవి, పుష్పాల మార్తమ్మ, దూదేకుల రసూల్‌బీ, పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులుగా పి.నాగార్జునరెడ్డి, తమ్మిశెట్టి రవి, జనరల్ సెక్రటరీలుగా ఎస్.సుమంత్, బొగ్గు వెంకట సుబ్బారెడ్డి, పెదపోతుల నాగార్జునరెడ్డి, ప్రచార విభాగం ఉపాధ్యక్షులుగా గంటా వెంకటేశ్వరరెడ్డి, శింగారెడ్డి గాలిరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా లింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జక్కి పెద్ద ఆంజనేయులు, షేక్ మస్తాన్ వలి, ఆర్‌టీఐ విభాగం ఉపాధ్యక్షులుగా భీమనబోయిన నారాయణ, మారంరెడ్డి వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి, అంబటి రామిరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(చిన్నా), రైతు విభాగం ఉపాధ్యక్షులుగా చాగంటి వెంకట నారాయణరెడ్డి, దొండేటి శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మందం వెంకటేశ్వర్లు, శింగారెడ్డి వెంకటరెడ్డి, రూపనగుడి రామిరెడ్డి, వలంటీర్ల విభాగం ఉపాధ్యక్షులుగా వడ్డెంగుండ్ల వీరాంజనేయులు, పరిశినేని శ్రీను, జనరల్ సెక్రటరీలుగా ఎ.హనుమంతారెడ్డి, బత్తుల మణిప్రసాద్, ఆదిమూలపు ఓబులయ్య, వైఎస్సార్ టీయూసీ ఉపాధ్యక్షులుగా రాంపనగుడి శ్రీనివాసరెడ్డి, కొట్టు వల్లురాజు, జనరల్ సెక్రటరీలుగా గొట్టిపాటి ఆత్మారాములు, రేళ్ల మంగారెడ్డి, నన్నబాల శ్రీను, మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులుగా దూదేకుల కాశయ్య, ఎస్‌కే ఇమాంసా, జనరల్ సెక్రటరీలుగా దూదేకుల మీరా సాహెబ్, ఎస్‌కె జిలానీ, ఎస్‌కె బీబీ, ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులుగా పి.వెలుగొండయ్య, కె.చింటుబాబు, జనరల్ సెక్రటరీలుగా ఎం.కాశయ్య, కె.జోజప్ప, చెల్లి చెన్నయ్య, సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షులుగా టి.శివకృష్ణ, గంజి చెన్నారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా చెరుకుల మణికంఠారెడ్డి, ఆవుల కృష్ణ, కొత్త అరుణ్‌కుమార్, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులుగా బిక్కి రామయ్య, వేల్పుల శివారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా తురక వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, సింగారెడ్డి అశోక్‌రెడ్డి, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులుగా బి.నాదగురు బ్రహ్మం, జి.బాలయ్య, జనరల్ సెక్రటరీలుగా పి.చంద్రశేఖర్‌రెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, ఎ.రామిరెడ్డి, యువజన విభాగం ఉపాధ్యక్షులుగా అంగిరేకుల భాస్కర్, మేడమాల చిన్నచెన్నయ్య, జనరల్ సెక్రటరీలుగా మాదిరెడ్డి రామకృష్ణారెడ్డి, తురక ప్రసన్న కుమార్, తుంపాటి ఆంజనేయులు, ఎస్‌టీ విభాగం ఉపాధ్యక్షులుగా తోట తిరుపతమ్మ, దాసరి నాగమ్మ, జనరల్ సెక్రటరీలుగా మేఘావత్ బ్రహ్మనాయుడు, మండ్ల నాగిలేటి, మేఘావత్ వీరాంజనేయ నాయక్‌ను నియమించారు.

మహిళల రద్దీకి తగిన ఏర్పాట్లు చేయాలి

- ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ

పొదిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని పొదిలి డిపో అధికారులకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం పొదిలి ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పొదిలి డిపో నుంచి 70 బస్సులను స్త్రీ శక్తి పథకానికి వినియోగించనున్నట్లు తెలిపారు. దర్శి, దొనకొండ, పొదిలి, మార్కాపురానికి షటిల్ సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. బస్టాండ్‌లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. సమావేశంలో పొదిలి డీఎం శంకరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎం సత్యనారాయణ

నేడు బలరామ జయంత్యుత్సవం

మార్కాపురం టౌన్: ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో మార్కాపురంలోని శుభం కన్వెన్షన్ హాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి బలరామ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 10వ తేదీన ఆమలక లక్ష్మీనారాయణస్వామి(వెంకచ్చమ్మ గుడి) దేవస్థానంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు చిన్నారులకు నైతిక విలువలపై అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్ స్వామీజీ ప్రవచనాలు ఉంటాయన్నారు. భక్తులు, పిల్లలు పాల్గొనాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

మార్కాపురం: ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సూచించారు. మార్కాపురం డిపోలో గత నెలలో డిపోకు అధిక ఆదాయం తీసుకునివచ్చిన సిబ్బంది జీవీరెడ్డి, ఎం.రంగయ్యకు శుక్రవారం నగదు పురస్కారాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడంతోపాటు గౌరవంగా మెలగాలని, అదే సమయంలో డిపోకు ఆదాయం తెచ్చే విధంగా డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాలని కోరారు.


సిబ్బందికి నగదు పురస్కారం ఇస్తున్న డీఎం నరసింహులు

హనుమంతునిపాడులో కుంభవృష్టి


సీతారాంపురం వద్ద పారుతున్న దోమలేరు


సీతారాంపురంకాలనీ వద్ద పడిపోయిన విద్యుత్ స్తంభం

- పొంగిన దోమలేరు
- గాలి, వానకు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

హనుమంతునిపాడు: మండలంలో గురువారం రాత్రి పొద్దు పోయిన తర్వాత ఉరుములు, మెరుపులు, గాలితో కుంభవృష్టి కురిసింది. వాన బీభత్సం మండల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. వీరరాంపురం, నందనవనం, ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, కూటాగుండ్ల, సీతారాంపురం, హనుమంతునిపాడు, ఉమ్మనపల్లి, హనుమంతాపురం తరదితర ప్రాంతాల్లో వర్షం జోరుగా కురిసింది. మండల కేంద్రంలో 96.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. వర్షానికి సీతారాంపురం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం కోతకు గురై పడిపోయింది. దోమలేరు పొంగి పొర్లింది. వంకలు, కుంటలు, చెక్ డ్యామ్‌లోకి నీరు వచ్చినట్లు ఆయా గ్రామాల్లోని ప్రజలు చెప్తున్నారు. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షమంటున్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం


పాతపాడులో పదునైన భూములు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం పడింది. పలు చోట్ల లోతట్టు పొలాల్లో వర్షం నీరు నిల్వ చేరింది. బ్రాహ్మణపల్లి కోమటి కుంట వర్షం నీటితో నిండింది. పొలాలు పదును కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేస్త్రీలకు నైపుణ్య శిక్షణ

మార్కాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని భవన నిర్మాణ మేస్త్రీల్లో నైపుణ్యం పెంచేందుకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం హౌసింగ్ డీఈ ఎ.పవన్‌కుమార్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్యగల, స్థానిక భాషలో చదవడం, రాయడవం వచ్చిన వారు శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. వచ్చేవారం నుంచి అక్టోబర్ వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు స్థానిక గృహ నిర్మాణ సంస్థ కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.